కథ

# మంచీ-చెడూ...

◆ మాకినీడి సూర్యభాస్కర్ ◆

**దేశాన్ని ప్రతిబింబించేట్లున్న ఆ బస్సు కదిలింది పూర్ణ గర్భిణిలా! బయలుదేరేటప్పటికే పూర్తిగా నిండిపోయి ఉంది. అడపా తడపా దిగేవాళ్ళే గానీ, ఆగినచోటల్లా ఎక్కేవారే ఎక్కువగా ఉంటున్నారు— మరణరేటు కంటే ఎక్కువైన జనన రేటును జ్ఞప్తికి తెస్తూ!**

ఇలా ఆలోచిస్తూ నిర్వేదంగా విండోవైపు సీట్లో కూర్చుని ఉన్నాడు డా.రావు. సుమారు యాభై సంవత్సరాలున్న ఆయన వయస్సులో దాదాపు ఓ యిరవై సంవత్సరాల ప్రొఫెషనల్ ఎక్స్‌పీరియన్సుతో కూడుకొన్న హుందాతనం తొణికిసలాడుతోంది. నిశితమైన ఆయన చూపుల్లో. నిశితత్వంతో పాటూ, కళ్లల్లో నీరసం కూడ కనబడుతోంది. క్రిందటి రాత్రి నిద్ర లేకపోవడమే కాదు. ఒక కేసు సీరియస్సై దాన్ని అటెండ్ కావడంవల్ల కలిగిన టెన్షన్‌తో కూడిన అలసట కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఆ పేషెంటుకు కాస్త రిలీఫ్ వచ్చేటప్పటికి ఉదయం తొమ్మిదైపోయింది. దాంతో డా.రావు యింటికి వెళ్లకుండా ఆ రోజు తాలూకు డ్యూటీలో లీనమైపోయాడు. మధ్యాహ్నం లంచ్ కూడ ఆసుపత్రికే తెప్పించుకుని, రాబోయే రెండు వారాలలో తాను నిర్వహించబోయే శిబిరం తాలూకు విషయాలను సమీక్షిస్తూ, చకచకా నిర్ణయాలు వేసుకుంటూ ఆ పని ఒక కొలిక్కి వచ్చిందనిపించాక సాయంత్రం ఆరు గంటలకు యింటికి బయల్దేరాడు. కాస్త రిఫ్రెషై, బ్రీఫ్ సర్దుకుని తను కేంప్ నడుపబోయే గిరిజన ప్రాంతానికి బయల్దేరాడు.

జిల్లాలో ఓ మూలకి విసిరేసినట్లున్న ఆ ప్రాంతం పదిమైళ్ల నిడివిగల దట్టమైన అరణ్యంతో వేరువేయబడి ఉంటుంది. అడవంతా బందిపోట్లకి ప్రసిద్ధి. అందుకే సర్వసాధారణంగా ఎవరూ రాత్రిపూట ప్రయాణం పెట్టుకోరు. జిల్లాలో వేర్వేరు ప్రాంతాలనుంచి శిబిరం పనికోసం వచ్చిన డాక్టర్లందరికీ తగిన సూచనలిచ్చి నిన్న పగటిపూట పంపించివేసాడు డా.రావు. సీరియస్ కేసు గురించి తాను ఉండిపోవలసి వచ్చింది.

## 2

నీరసంగా మూలుగు వినబడటంతో డా.రావు ఆలోచనలకు అంతరాయం కలిగింది. తనకు రెండు సీట్లకు ముందు నుంచి ఆ మూలుగు వినబడుతున్నట్లు, గుర్తించాడు. వెంటనే లేచి వెళ్లి చూసాడు. పదమూడు, పదిహేనేళ్ల అమ్మాయి, బహుశా తల్లి కావచ్చు. ఆమె ఒడిలో పడుకొని ఉంది. వాళ్ల తీరు చూస్తే గిరిజనులు కావచ్చనిపించింది డా.రావుకు. తన సీట్లో కొచ్చి మెడికల్ కిట్ తీసుకువెళ్లాడు. థర్మామీటరు ఆ అమ్మాయి నోట్లో ఉంచి స్టెత్‌తో పరిశీలించాడు. టెంపరేచరు బాగానే ఉంది. మిగతా ప్రాథమిక పరీక్షలేవో వేసి తను భయపడే జబ్బు కాదని నిర్ధారించుకుని, సంతృప్తిగా నిట్టూర్చాడు డా.రావు. ఆ అమ్మాయికి జ్వరానికి మందిచ్చి, థర్మామీటర్‌ను, స్టెత్‌ను ఏప్రాన్ పాకెట్లో వేసుకుంటూ వచ్చి, తన సీట్లో కూర్చున్నాడు.

గిరిజన ప్రాంతంలో ఈ మధ్య భయంకరమైన వ్యాధొకటి ప్రబలిపోయింది. వ్యాధైతే క్రొత్తది కాదుగానీ, యించుమించు పూర్తిగా ఇరాడికేట్ చేసామనుకొనే సమయంలో మళ్లీ ఎపిడెమిగ్గా దాపురించింది. తొంభై శాతం చిన్న పిల్లలకు వచ్చే ఈ వ్యాధి తీసుకోవలసిన ముందు జాగ్రత్త చర్యల జ్ఞానమసలే లేని గిరిజనుల్లో ప్రాణాంతకంగా మారడంతో ఆ ప్రాంతంలో చాలా మంది చిన్న పిల్లలు చనిపోవడం జరిగింది. అందుకని ప్రభుత్వం డా.రావు అధ్యక్షతన గిరిజనులకు ఉచిత వైద్య సేవలనందించే నిమిత్తం వారికి ఆరోగ్య సూత్రాల్ని, వ్యాధి సోకినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల్ని వివరించడానికి శిబిరాన్నొకటి ఏర్పాటు చేసింది.

## 3

బస్ అడవిలోకి ప్రవేశించింది. అప్పటికే ప్రయాణీకులందరు యించుమించు దిగిపోయారు. యింకా మిగిలి ఉన్నది ఏ ఎనమండుగురో, డా.రావులా తప్పని సరి పనిమీద వెళ్లేవాళ్లే.

అడవి దాటే వరకు ఒక గండం. ప్రయాణీకులెవ్వరూ నిద్రపోరు. దొంగలు ఎప్పుడు ఎలా వస్తారో

● ● ●

**కథల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

● ● ●

**కథ**



తెలీదు. రాకపోనూ వచ్చు. వస్తే మాత్రం లూటీ తప్పదు.

బస్సు అడవి మధ్యలో కొచ్చింది. వేగంగా నడుపుతున్న డ్రైవర్ కు ఎదురుగా రోడ్డుమీద చెట్టు విరిగి అడ్డంగా పడి ఉండడంతో సడన్ బ్రేకు వేయాల్సిన అవసరం రానే వచ్చింది.

ఒక్కసారిగా బస్సు ఆగడంతో ప్రయాణీకులందరూ ఏమి టేమిటని గుసగుసలాడుకుంటూ మెడలు వాచి, చెవులు రిక్కించి చూసారు విన్నారు ఎవరికీ, ఏమీ గోచర మవ్వనే లేదు. తలుపు తీసుకుని ముగ్గురు ఆగంతకులు లోనికి ప్రవేశించారు.

ఒకడు గుమ్మం దగ్గర, లోపలి వారిని బయటకు పోనీయకుండా కాపలాగా నిల్చుండిపోయాడు. యింకొకడు కత్తి పట్టుకుని బెదిరిస్తూ వెనక్కి నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకుంటూ డా.రావు కూర్చున్న ముందు సీటు వరకు వచ్చి ఆగాడు. వేరొకడు, ''అందరూ పెట్టెలు, బ్యాగ్ లు తెరవి ఉంచండి'' అంటూ ఆదేశం జారీ వేసి ప్రయాణీకుల దగ్గరున్న విలువైన వస్తువుల సేకరణలో మునిగిపోయారు.

ఒక్క కత్తిని చూసి అంతమంది ఎందుకూ కొరగాకుండా పోవడం డా.రావుకు విస్మయాన్ని కలిగించింది. మనిషికి ప్రాణం మీదన్న తీపి అదే మనిషిని ఎంత నిర్వీర్యం చేస్తుందో అయితే, అదే మనిషికి అదే ప్రాణం మీదున్న తీపి అదే కత్తితో డాక్టర్లవేత తన శరీరాన్నే పరపరా కోయిస్తుంది కదా! ఆలోచనలకు తనకే నవ్వు వచ్చింది డా.రావుకు.

ఆలోచిస్తున్నాడు కానీ, ఏం చేయడానికీ పాలుపోవడం లేదు. అప్పటికే దొంగవాడు, కండక్టరు దగ్గర కేష్ బేగ్ తీసుకుని కొంతమంది ప్రయాణీకుల దగ్గరున్న డబ్బు దస్కం సేకరించాడు. ఇంతలో చటుక్కున ఒక మెరుపు మెరిసింది. డా.రావు మస్తిష్కంలో ఏప్రాను పాకెట్లో ఉన్న స్టెత్ స్కోపును

ఒడుపుగా పట్టుకొని స్టెత్‌వాబ్‌ను కత్తి పట్టుకున్న ఆగంతకుడి వెన్ను కానించి చేతులు పైకెత్తమని ఆదేశించాడు. గుమ్మం దగ్గర నించున్న వాడికీ, వస్తువులు సేకరించేవాడికీ స్టెత్‌స్కోప్ కనిపించకుండా వాణ్ణి గైడ్ వేస్తూ, చేతిలోని కత్తిని లాగుకున్నాడు డా.రావు.

**అడవి దాటే వరకూ ఒక గండం. ప్రయాణీకులెవ్వరూ నిద్రపోరు.**

ఆయుధ సంపత్తి పరాధీనం కావడంతో పలాయన మంత్రం పఠించబోయేరు ఆగంతకులు. గుమ్మం దగ్గరున్నవాడు వెంటనే తలుపు తెరిచి బయటకు గెంతబోయేటంతలో కండక్టరు వాడి రెక్కపట్టుకుని ఆపేడు. పెల్లుబికిన ఉత్సాహంతో ప్రయాణీకులు ఆ ముగ్గుర్నీ బస్సు దింపి తన్నడం మొదలెట్టారు ఎవరు, ఎక్కడ ఎలా కొడుతున్నారో తెలీకుండా కొడుతున్నారు. డా.రావు ఆగమని వారిస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. అయిదు నిముషాలపాటు అదే పనిగా చితకబాదిన ప్రయాణీకులకు కొంత అలసట కలిగింది. అదే అదునుగా భావించి, డా.రావు తన ప్రయత్నాన్ని ముమ్మరం కావించి, నాలుగైదు దెబ్బలు తనూ తిని, చివరికి ఎలాగైతేనేం ఆపగలిగాడు. అప్పటికి దొంగలు ముగ్గురూ కదలలేకుండా పడి ఉన్నారు మూలుగుతూ.

ప్రయాణీకులందరూ రకరకాలుగా కామెంట్ వేసుకుంటూ బస్సులోనికి ప్రవేశించారు. డా.రావు మాత్రం బస్సెక్కకుండా క్రింద రోడ్డు మీద పడున్నవారి గాయాలను బస్‌లైట్ల వెలుగులో పరీక్షిస్తూ ఉండిపోయాడు. కండక్టరు, డ్రైవరు డా.రావును బస్సులోనికి రమ్మని ఒకటే కంగారు పెట్టేస్తున్నారు. ప్రయాణీకులు కూడ అసహనంగా చూస్తున్నారు.

ఒక నిర్ణయానికి వచ్చినట్లుగా డా.రావు వెనుదిరిగి బస్‌లోనికి ప్రవేశిస్తూ, కండక్టరుతో ''ఒక అరగంట పాటు బస్సాపితే వాళ్ల గాయాలకు కట్లు కట్టేయవచ్చు కండక్టర్'' అన్నాడు. ''మీకేమైనా మతి పోయిందా డాక్టర్, కట్లు కడతానంటున్నారు'' డాక్టర్ మాట — వింటూనే అన్నాడు కండక్టర్. ''వాళ్లకు ఆ మాత్రం శాస్తి జరగాల్సిందే.... పైగా... మీ ప్రాణానికి ముప్పు కూడా... సీట్లో కెళ్లి కూర్చోండి'' అంటూ తలుపు వేయబోయాడు. ''ఆగండి'' అంటూ డా.రావు తన బ్రీఫ్ మెడికల్ కిట్ అందుకుని బస్ దిగుతూ ''గాయాలతో పడున్న వాళ్లకి చికిత్స వేయడం డాక్టరుగా నా కనీస బాధ్యత. అది నా వృత్తి ధర్మం... ... మీకు వీలుంటే బస్సును ఒక అర్ధగంట ఆపండి, లేకపోతే... ... బస్సును ఈ రాత్రికి నిలుపు చేసే ఊర్లో రేపట్నుంచి మేం వైద్య శిబిరమొకటి మొదలెడ్తున్నాం. అక్కడ మా వాళ్లకు నా గురించి కాస్త తెలియజేస్తే సంతోషిస్తాను'' అంటూ దిగిపోయాడు.

కండక్టరు, డ్రైవరు కాస్త ఆలోచించి బస్సు నిలిపి ఉంచడానికి యత్నించినా, ప్రయాణీకుల్లో చాలా మంది నిరాకరించడంతో బస్సును పోనీయక తప్పలేదు వారికి. వారి భయం వారిది. ఈ నట్టడవిలో ఆగిపోతే మరో ముఠా దోపిడీగాళ్లు రావచ్చు తమవాళ్లకు జరిగిన అన్యాయాన్ని(?) చూసి వాళ్లు మరీ పేట్రేగిపోవచ్చు. ఏం చెప్పగలం అనుకున్నారు. ఆ విధంగా డా.రావు ఆ కారడవిలో... కారు చీకట్లో... వెనకా ముందు చూడకుండా దొంగలకు వైద్య సేవ అనందించే నిమిత్తం ఆ రాత్రి ఉండిపోయాడు.

''మీరేం భయపడకండి. మీ గాయాలకు మందురాసి కట్లు కడతాను. రెండ్రోజుల్లో తగ్గిపోతాయి' అంటూ టార్చిలైటు వెలుగులో కిట్‌లోని కాటన్ తీసి గాయాలపై గడ్డ కట్టిన రక్తాన్ని తుడుస్తూ అన్నాడు డా.రావు. దొంగలు ముగ్గురికీ డా.రావు ప్రవర్తన ఆశ్చర్యాన్ని కలిగించింది. దొంగలైన తమకోసం డా.రావు అక్కడ అలా వారితోపాటు ఆ రాత్రికి ఉండిపోవడం... అందులోను వాళ్ల గాయాలకుకట్లు కట్టడం కోసం ఉండిపోవడం వాళ్లకి విస్మయాన్ని ఏదో చెప్పలేని భావపరంపరను — డాక్టరు మీద గౌరవం భక్తిప్రపత్తులు, వాళ్ల మీదవాళ్లకే ఒక రకమైన జుగుప్సఅసహ్యం — ఇలా ఎన్నో ఆలోచనల కలగలుపు భావాన్ని కలిగించింది.

మందురాసి డ్రెసింగ్ వేసేలోపు ఆ ముగ్గురికీ డా.రావు ప్రాణ స్నేహితుడైపోయాడు. ఇంకా మిగిలి ఉన్న రాత్రిలో అన్ని గంటలూ వాళ్లలో మానసిక పరివర్తన తీసుకురావడానికి అవసరమే లేకపోయాయి. డా.రావుకు ముగ్గురూ అప్పటిదాకా గడిపిన జీవితానికి స్వస్తి చెప్పి యికపై కట్టెలు కొట్టుకుని బ్రతుకుతామని డా.రావుకు ఒట్టేసి మరీ చెప్పారు.

ఒక మంచి పని చేసాననే ఆనందం, ఆత్మ సంతృప్తి దొంగలు ముగ్గురితో ఆనందంగా గడిపాడు వారికి సేవచేస్తూ. డా.రావు శేషరాత్రిని రోడ్డుప్రక్క చెట్టుక్రింద .... ఆవులిస్తూ!

## 4

రెండు వారాల శిబిరాన్ని విజయవంతంగా ముగించి వచ్చారు డా.రావు. అతని బృందం వచ్చి జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతల్ని స్వీకరిస్తూ, మళ్లీ ఎప్పటి రొటీన్‌లో పడిపోయాడు డా.రావు.. అనుబంధంగా వైద్యకళాశా


# డియర్ ఫ్రెండ్!

స్నేహం చాలా గొప్పది! చదువుకునే రోజుల్లో ఎందరో స్నేహితులుంటారు. ఉద్యోగరీత్యా ఊళ్ళు మారడంలో ఎవరెక్కడున్నారో మరచిపోతాం.

మీ పాత స్నేహితులను మయూరి ద్వారా కలుసుకోండి.

మీ స్నేహితులకు పదిలైన్లు మించకుండా ఉత్తరం రాయండి. వారు మిమ్మల్ని గుర్తుపట్టేందుకు ఫోటో కూడా పంపండి. తిరిగి మీకు రిప్లయి ఇచ్చేందుకు మీ చిరునామా స్పష్టంగా రాయండి.

మీ మిత్రులను పలకరించాల్సిన చిరునామా-

డియర్ ఫ్రెండ్!
కేరాఫ్ మయూరి
5-8-55/ఏ,
నాంపల్లి స్టేషన్ రోడ్,
హైదరాబాద్.

**దొంగలకు వైద్య సేవలనందించే నిమిత్తం ఆ రాత్రి ఉండిపోయాడు.**

ల ఉండడంవల్ల ఆ ఆసుపత్రి మరీ విస్తృతంగా అభివృద్ధి వేయబడింది. అక్కడ ట్రీట్ వేయని జబ్బంటూ యించుమించు లేదనే చెప్పుకోవాలి. ఊపిరి సలుపని పని ఉంటుందెప్పుడూ డా.రావుకు. అందులోను రెండువారాలుగా లేకపోవడమేమో, పెండింగ్ వర్క్ పెరిగిపోయింది. కొత్తగా అడ్మిటైన కేసులు చూసుకొంటూ, అన్ని వార్డులూ తిరుగుతూ, హృద్రోగ విభాగంలోనికి వచ్చాడు డా.రావు. అక్కడి స్పెషల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో అడ్మిటయ్యాడు మూడ్రోజుల క్రితం ఒక యువకుడు.

రూంలోనికి ప్రవేశించబోతుండగా వార్డుబాయ్ వచ్చి "సార్, సదానందం గారబ్బాయి ఈ రూంలోనే ఉన్నారు. అయ్యగారు కూడ ఇక్కడే ఉన్నారు" చెప్పాడు. వింటూనే డా.రావు ముఖం మ్లానమైంది. సదానందం ఆ ఊరి ఎమ్మెల్యే. గతంలో ఏదో శాఖకు మినిష్టర్‌గా కూడ వేసాడు.

డా.రావు లోపలికి వెళ్లడంతోనే, ఈజీ ఛెయిర్లో కూర్చొని 'ఈనాడు' చదువుతోన్న సదానందం, "రండి, రండి డాక్టరుగారూ! మీకు తెలుసుగా. వీడు నాకు ఒక్కగానొక్క కొడుకు. మొన్న ఛెస్ట్ పెయినొచ్చి అడ్మిటయ్యాడు" అన్నాడు.

"తెలిసింది. యిప్పుడు అతనికకింకే ప్రమాదమూ లేదని చెప్పారు మా వాళ్లు. డిశ్చార్జి వేస్తాం. మీరతన్ని ఈ వేళే తీసుకెళ్లమ్న" చెప్పాడు డా.రావు.

"నిన్న మీ అసిస్టెంటుకు చెప్పానే, ఒప్పుకున్నాడు కూడా... ఓ పదిరోజులిక్కడ ఉంటే వాడికి రెస్టుంటుందనీ... ... బాగుంటుందనీను. ఇప్పుడు మీరిలా అంటున్నారేం?" అడిగాడు సదానందం.

రాజకీయ నాయకులకు ఎదురు చెబితే శంకరగిరి మన్యాలే బ్రతుకనుకుంటూ, ఒకక్షణమాలోంచి అన్నాడు డా.రావు. "అబ్బే, దానికేం, మీరుంచితే ఉంటాడు. కాకపోతే, యింటిదగ్గర సౌఖ్యంగా ఉంటుందేమోననీ..." అంటూ, బయటకు రాబోతూ, "మా స్టాఫ్ మీకు బాగానే కోపరేట్ వేస్తున్నారు కదా సార్" అని శలవు తీసుకున్నాడు డా.రావు సదానందం దగ్గర.

## 5

హృద్రోగ విభాగం నుంచి సరాసరి తన ఛాంబర్లోకి వచ్చి కూర్చున్నాడు డా.రావు విచారవదనంతో పని ఏ మాత్రం చూడాలనిపించకపోవడంతో కుర్చీకి తల ఆనించి కూర్చొని ఆలోచనలో కూరుకుపోయాడు.

తన బ్రతుకులోని వెలుగును నాశనం చేసిన వాళ్లు సదానందం, అతని కొడుకు. అలాంటి వాళ్లకి వినయవిధేయలతో ముఖం మీద చిరునవ్వు అంటించుకుని సేవలందించాల్సిన స్థితి తనది. నిజంగా ఎంత దుర్భరం? సదానందం కొడుకు డిశ్చార్జి అయ్యేంత వరకు శలవు పెట్టి పోదామా అనిపించింది డా.రావుకు.

సదానందానికి ఒకే ఒక కొడుకట. మరి తనకూ ఒక్కగానొక్క కూతురు. ఏమైంది? సదానందం కొడుకు మాయమాటలు నమ్మి తన సర్వస్వం అతనికి అర్పించింది అర్చన. అమాయకురాలు. కాలేజీలో చదువుకొనే రోజుల్లో, తనను పెండ్లి వేసుకుంటానని నమ్మించి, అంతా అయ్యాక పెండ్లికి తన తండ్రి ఒప్పుకోవడంలేదని తప్పుకున్నాడు. అర్చన బ్రతుకు నట్టేట్లో ముంచాడు. అభాగ్యురాలు. తనతో చెప్పలేక జరిగిన అవమానాన్ని భరించలేక అర్చన స్లీపింగ్ పిల్స్ మింగి తన బ్రతుకును అర్ధాంతరంగా ముగించుకొంది— జరిగినదంతా ఉత్తరంలో రాసిపెట్టి, పిచ్చిపిల్ల తనతో ఒకమాట చెప్పినా బాగుండేది. కాళ్లా వేళ్లా పడి ఎలాగో పెళ్లి జరిపించి ఉండేవాడు. డా.రావు కనుకొలుకుల్లోనుంచి అశ్రుకణమొకటి రాలిపడింది భారంగా.

అలా బాధపడుతూ కూర్చున్న డా.రావుకు అనుకోకుండా ఒక ఆలోచన వచ్చింది. కాసేపు తప్పేమో అనిపించింది. కానీ, ఆలోచించగా, ఆలోచించగా అదే సరైనదనిపించడంతో యిక కూర్చోలేని డా.రావు తన పథకాన్ని అమలు పరచడానికి లేచాడు. లేచింది మొదలు పరుగులెత్తాడు లేడిలా.

తన పగ, ప్రతీకారం చక్కగా తీరుతాయనిపించింది డా.రావుకు. ఇంతకాలం తను ఏమీ చేయలేకపోయాడు. అర్చనను తలచుకొంటూ జీవచ్ఛవం


పురాణాల్లో కూడా శృంగారానికి
చాలా ప్రాధాన్యత వున్నది.
పురాణాలను మధించి
పాలంకి. ఎస్. అందిస్తున్న
శృంగారగాథాలహరి
వచ్చే వారమే ప్రారంభం

లా ప్రతికాడు. యిప్పుడు అవకాశం తనను వెతుక్కుంటూ వచ్చింది. ఏ మాత్రం ఆలస్యం చేయడానికీ వీలులేదు.

ఆ రోజంతా డా.రావు బిజీగానే ఉన్నాడు. పాథాలజీ డిపార్టుమెంటుకు నాలుగుసార్లు మైక్రోబయాలజీ డిపార్టుమెంటుకు ఆరుసార్లు తిరిగి, తన పథకం ప్రకారం అన్ని ఏర్పాట్లు చేసుకుని, మనస్సు తేలిపోతుండగా తన ఛాంబర్ చేరుకున్నాడు.

ఈ రాత్రికి తన పగను చాలా గ్రాండ్‌గా తీర్చుకోబోతున్నాడు. సదానందం మీద అతని కొడుకు మీదా... ఏ మాత్రం అనుమానం రాని పద్ధతిలో! తన పథకానికి తనే మురిసిపోతూ యింటికి బయల్దేరాడు డా.రావు.

## 6

ఆసుపత్రినుంచి పెందలకాడనే యింటికి చేరడంతో ఎనిమిది గంటలకే భోజనాల దగ్గర కూర్చున్నారు డా.రావు దంపతులు. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కానిస్తున్నారు.

అర్చన గురించిన జ్ఞాపకాలతో దిగులుగా ఉంటోన్న తన భార్యకు కొంత ఊరటగా ఉంటుందని పెద్ద కొడుకును తీసుకువచ్చాడు డా.రావు. హాల్లో మనవడు గట్టిగా చదువుతూ కంఠస్థం చేస్తున్నాడు పద్యం—

''ఉపకారికి ఉపకారము
విపరీతము కాదు సేయ వివరింపంగా
అపకారికి నుపకారము
నెపమెన్నక సేయువాడు నేర్పరి సుమతీ!''

మనవడు చదివే పద్యం వినబడుతోంది— కాజువల్‌గా వింటున్నాడు డా.రావు. వింటూనే కబుర్లు చెబుతున్నాడు. చెబుతూనే వింటున్నాడు. వింటూనే తింటున్నాడు. తింటూనే... వింటున్నాడు. అంతలో పరిగెత్తుకుంటూ వచ్చి ''తాతయ్యా, ఈ పద్యం నాకర్థమవ్వడంలేదు. చెప్పవా?' అడిగాడు మనవడు.

వాడికి అర్థమయ్యే రీతిలో చెప్పడం కష్టమనిపించింది. అయినా ప్రయత్నించి వాడి భాషలో తేలిక పదాలతో చెప్పాలని ప్రయత్నించాడు డా.రావు— ''దీని అర్థం నాన్నా... ... చాలా చక్కని పద్యం యిది... అర్థం ఏమిటంటే మనం ఒకళ్లకి యిష్టమైన పని చేసామనుకో, దాన్ని ఉపకారం అంటారు. అంటే మేలు కలిగే పనన్నమాట... ... అలా, మనకి ఉపకారం చేసినవాళ్లకు తిరిగి మనం ఉపకారం చెయ్యడం గొప్ప కాదు. మనకు అపకారం... ఆ... అపకారం అంటే ఉపకారం కానిదన్నమాట. మనకి అపకారం చేసినవాళ్లకి కూడ ఉపకారం చేసామనుకో, అదీ గొప్పతనం. అదన్నమాట. అర్థమైందా? చక్కని పద్యం కదూ!''

అర్థమైందో, లేదో, మనవడు ఏ సమాధానం చెప్పలేదు. అది పట్టించుకొనే స్థితిలో డా.రావూ లేడు. ఉన్నతమైన ఆ పద్యం తాలూకు భావం డా.రావు మెదడులో గింగిర్లు తిరుగుతోంది. అపకారం చేసినవారికి సైతం ఉపకారం చేయడం! అదీ ప్రతిఫలాపేక్ష లేకుండా!! మహోన్నతమైన మానసిక స్థితి.

ఆలోచనామగ్నుడైన డా.రావుకు వెంటనే, త్వరలో అమలుపరచబడబోయే తన పథకం గుర్తుకొచ్చింది. అదే కానీ అమలు పరుచబడితే? సదానందం కొడుకు ఏమౌతాడు? అతని భవిష్యత్తు నాశనమైపోదూ? ఎప్పుడో జరిగినదానికి యిప్పుడా పగ తీర్చుకోవడం? తనేనా యింత మూర్ఖంగా ఆలోచించిందీ? తన ఆలోచనకు తనకే సిగ్గు వేసింది డా.రావుకు. సదానందం భార్య అర్చన లాంటి మరో అమ్మాయి కాదూ! ఆ అమ్మాయికి ఘోరమైన అన్యాయం చేయబోయింది తనేనా?—'' అయిందేదో అయింది. యిప్పుడే అనర్థమూ కొత్తగా జరగడానికి వీలులేదనుకొన్నాడు డా.రావు.

టైం చూసాడు. ఎనిమిదిన్నర కావస్తోంది. పర్వాలేదు, యింకా టైముంది. తొమ్మిది వరకు ఆదరాబాదరా డ్రస్ వేసుకుని ఆసుపత్రికి బయల్దేరాడు డా.రావు. ఆసుపత్రికి వెళ్తూనే కార్డియాలజీ విభాగానికి వెళ్లాడు. సదానందం కొడుకు వద్దకు వెళ్లి, నర్స్ యింకా అతనికి యింజక్షన్ యివ్వలేదని తెలుసుకుని నిట్టూర్చాడు డా.రావు. అంతవరకు పొందిన టెన్షన్ సడలటంతో రిలీఫ్‌గా ఫీలయ్యాడు అంతకు ముందు తను అక్కడ ఉంచిన మందుసీసాను జేబులో వేసుకొని, దాని స్థానంలో వేరొకటుంచి వచ్చాడు డా.రావు. ఆ యింజక్షనే గానీ యిస్తే, అతనికి ఎయిడ్స్ రోగం సంక్రమించేది. ఎయిడ్స్ వైరస్‌ను ఆ మందు సీసాలోనికి యిన్‌ఫ్యూజ్ చేసింది తనే మరి! అంత అర్జంటుగా చెప్పా పెట్టకుండా వచ్చి మందు సీసాను డాక్టరుగారెందుకు మార్చారో అర్థంకాక, ఆయన వెళ్ళిన వైపే చూస్తూ నిల్చుండిపోయింది నర్సు. ఆయన్నడిగే ధైర్యం లేక.

## 7

కారు యింటివైపు పరుగెడుతోంది. వెనుక సీట్లో కూర్చున్నాడు డా.రావు ఆలోచనల్లో పడిపోయాడు. తన కూతురి జీవితం అంతానికి కారకుడైన సదానందం కొడుకుపై ప్రతీకారం తీర్చుకుందామనుకున్నాడు తను. కాని ఆఖరు క్షణంలో తనలో మేల్కొన్న వివక్షత, విజ్ఞత తనని పని చేయనివ్వలేదు.

ఎప్పుడూ తను చేసే పని మంచిదో కాదో అంచనా వేసుకునే డా.రావు యిప్పుడూ అదే పనిలో నిమగ్నమయ్యాడు. అసలు మంచిపని అంటే ఏమిటి? చెడ్డపని అంటే ఏమిటి? ఒక పనిని చేసాకా, ఆనందం ఆత్మ సంతృప్తి కలిగితే అది మంచి పనా? వెంటనే డా.రావుకు కారడవిలో కారు చీకట్లో రోడ్డు మీద చెట్టు క్రింద గడిపిన రాత్రి, తదనుభూతి గుర్తుకొచ్చాయి. ఐతే, తను అనుకొన్న విధంగా సదానందం కొడుకుపైన ప్రతీకారం తీర్చుకుని ఉంటే కూడా తనకి ఆనందం కలిగి ఉండేది కదా?! మరైతే అదీ మంచి పనేనా? కాదంటే మనస్సాక్షి. ఏది మంచి ... ఏది చెడు? తల విదిలించి జారగిలబడి, కళ్లు మూసుకుని ఆలోచిస్తున్నాడు డా.రావు. కారు పరుగెడుతూనే ఉంది, డా.రావు ఆలోచనల్లో! ●


జాబ్ ప్లీజ్

మీకు అన్ని అర్హతలూ ఉన్నాయా? అయినా ఉద్యోగం లేదా? అయితే మీ అర్హతలు, కోరుకునే ఉద్యోగ వివరాలు రాసి ఫోటోతో సహా పంపండి! మయూరిలో ప్రచురిస్తాం.

వివరాలు
పంపవలసిన
చిరునామా-
జాబ్‌ప్లీజ్
కేరాఫ్ మయూరి
5-8-55/ఏ,
నాంపల్లి స్టేషన్ రోడ్,
హైదరాబాద్ 1.